

అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడలో అంబేద్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణ సన్నాహక ఏర్పాట్లపై మంత్రి వనిత అధ్యక్షత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు అంబేద్కర్ వాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతుందన్నారు. రాజ్యాంగాన్ని తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఈ నెల 19న విజయవాడ నడి ఒడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనం ప్రారంభానికి అందరూ హాజరు కావాలన్నారు.

ఎస్మా వద్దు... సమస్యలు తీర్చండి

అంగన్‌వాడీలకు మద్దతుగా రాస్తారోకో...
అడ్డుకునేందుకు పోలీసుల విఫలయత్నం
కార్మికుల ప్రతిఘటనతో వెనక్కితగ్గిన వైనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎస్మా వద్దు.. సమస్యలు తీర్చండి అంటూ కేంద్ర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ, సమగ్రశిక్ష ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల డిమాండ్లను తక్షణం నెరవేర్చాలంటూ కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో జరిగింది. తొలుత కోటిపల్లి బస్టాండ్ నుంచి శ్యామల సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం శ్యామల సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. దీన్ని అడ్డుకునేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ సమయంలో ఎస్మా వద్దు -వేతనాలు పెంచండి అంటూ కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా కార్మికులు ప్రతిఘటించారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కె.జోజి మాట్లాడారు. రోమ్ నగరం తగలడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్టు రాష్ట్రంలో రెండు లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు పెరిగిన ధరల కనుగునంగా వేతనాలు, సౌకర్యాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెలు చేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర అంటూ ఆటలాడుకుంటున్నారన్నారు. ఇలా వ్యవహరించడం ప్రభుత్వానికి తగదన్నారు. ఇంటి పన్నులు, కరెంటు ఛార్జీలు, చెత్త పన్ను, నిత్యావసరాల ధరలు, పెట్రోలు డీజిల్ ధరలను, నిరుద్యోగాన్ని ఈ నాలుగేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం ఇష్టానుసారం పెంచిందన్నారు. ఇప్పుడు వేతనాలు పెంచమనేసరికి ఎస్మా చాటున దాక్కుని ఆకలి కడుపులతో సమ్మె చేస్తున్న ఉద్యోగులపై నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. తక్షణం అంగన్‌వాడీలను ఎస్మా పరిధిలోంచి తొలగించాలని, మున్సిపల్ కార్మికులకు ధరల కనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సమగ్రశిక్ష ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, మినిమం టైమ్ స్కేల్, రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఎస్మా ప్రయోగించిన ముఖ్యమంత్రులకు పట్టిన గతే జగన్‌కీ పడుతుందని హెచ్చరించారు. కార్మికులకు, ఉద్యోగులకు కార్మిక సంఘాలు అండగా ఉంటాయన్నారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కెఎస్‌వి.రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.అన్నామణి, ఎం.వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఎఐటియుసి సీనియర్ నాయకులు నల్లా రామారావు, జట్లు లేబర్ యూనియన్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు నాగమణి, రాంబాబు, కె.రామకృష్ణ, దుర్గ, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీ నాయకులు ర్యాలీ


సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు


రాస్తారోకో...


వినతిపత్రం అందిస్తున్న 108 యూనియన్ నాయకులు

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలపై ప్రభుత్వం స్పందించనందున ఈ నెల 23 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు 108 ఉద్యోగులు మంగళవారం జెసి ఎన్.తేజ్‌భరత్‌కు సమ్మె నోటీసులు అందించారు. ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నోటీసులు అందించారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.రమణ, జిల్లా కార్యదర్శి గుజ్జుల రమేష్ బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు విఎస్.నారాయణ మాట్లాడారు. 108 ఉద్యోగులు అనేకేళ్లుగా వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్నారన్నారు. 108 ఉద్యోగులను నేరుగా అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేరుస్తామని 2019లో జగన్ తెలిపారన్నారు. నాలుగేళ్లుగా ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా నేటికీ ఇది అమలు కాలేదన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాల్లో గతంలో 108 ఉద్యోగులకు వెయిటేజీ ఇచ్చారన్నారు. కాని ప్రస్తుత ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖలో డిఎంఇలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్న ఇఎంటి పోస్టుల నోటిఫికేషన్లో సర్వీసు ప్రకారం వెయిటేజీ ఇవ్వాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. 22లోగా డిమాండ్లను నెరవేర్చకుంటే 23 నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. అత్యవసర సేవలను దష్టిలో పెట్టుకొనిని తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, రమేష్ నాయుడు, నాగరాజు లోహి,దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రైలే ట్రాక్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


ట్రాక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

అన్నపూర్ణమ్మపేట, మేదరవీధి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు రైల్వే ట్రాక్‌పైకి చేరకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనరు కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ అధికారులు, రైల్వే అధికారులతో కలిసి కమిషనరు రైల్వే ట్రాక్‌ను మురుగునీరు ట్రాక్‌పైకి చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చినందున రైల్వే అధికారులతో కలిసి పరిశీలించామని తెలిపారు. గార్బేజ్ పట్టాల పక్కన పడకుండా జాలీలు ఏర్పాటు చేయాలన్నారు. గుండు వారి వీధి రోడ్ విస్తరణ మాస్టర్ ప్లాను ప్రకారం విస్తరణ స్కెచ్ తయారు చేయాలని ఆదేశించారు. పుష్కరఘాట్ ఆయన వెంట సూపరింటెండింగ్ ఇంజినీరు జి.పాండురంగారావు, సిటీ ప్లానరు జివిఎస్ఎన్.మూర్తి, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఇఇ శేషగిరిరావు, అసిస్టెంటు ఇంజనీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.


విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి

'వైఎస్ఆర్‌ను మరువలేము'

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైఎస్ఆర్‌ను ఎన్నటికీ మరువలేరని, ఆయన ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా జీవించి ఉంటారని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. పసివేదల అంబేద్కర్ కాలనీలో సొసైటీ డైరెక్టర్ దాసరి వెంకటరాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పసివేదలతో గతంలో చంద్రబాబు పాదయాత్ర సమయంలో డ్వాక్రా రుణమాఫీ, బంగారు అభరణాలపై రుణాల మాఫీ చేస్తానని అబద్ధపు హామీలతో మహిళలను మోసం చేశారన్నారు. వైఎస్ఆర్ విగ్రహావిష్కరణకు నానా ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. జగన్ ప్రజా సంకల్పయాత్ర మొదలు పెట్టి నేటితో ఐదేళ్ల పూర్తయ్యిందని, అదే రోజున వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ జరగడం హర్షణీయమన్నారు. మహిళా సాధికారత సాధించేలా సిఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించాలన్నారు. జగనన్న మేనిఫెస్టోలో 25 లక్షల ఇళ్ల ఇస్తామని చెప్పారనానరు. ఇప్పటి వరకూ 32 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల 24గంటల దీక్ష

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్‌వాడీల 24 గంటల దీక్ష కొనసాగింది. పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు ఈ దీక్షల్లో పాల్గొన్నారు. ఈ దీక్షలను ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీరాణి మాట్లాడారు. ఎస్మా ప్రయోగించినా బెదిరేది లేదన్నారు. అన్నింటికీ తెగించే నిరవధిక సమ్మెలోకి దిగామన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా అంగన్‌వాడీలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలన్నారు. మంత్రులు, సలహాదారులు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్‌వాడీలపై బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకొచ్చి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంగన్‌వాడీల దీక్షలకు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.అన్నామణి, జిల్లా కోశాధికారి వెంకటలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.మార్త, సుజాత, సూర్యకాంతం, సునీత, సామలక్ష్మి, పాల్గొన్నారు. **చాగల్లు** తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. ఈ సందర్భంగా పి.విజయకుమారి, కె.లక్ష్మి మాట్లాడుతూ కొందరు కార్యకర్తలు సబ్ కలెక్టరేట్ వద్ద సమ్మెలో పాల్గొన్నారు. గౌరవ వేతనం మాకొద్దు కనీస వేతనం కావాలంటూ నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి, మహాలక్ష్మి, అరుణ్‌కుమారి పాల్గొన్నారు. **గోకవరం** తహశీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్వహిస్తున్న సమ్మెకు జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **నల్లజర్ల** లో సమ్మెను కొనసాగిస్తున్నారు. ఇటీవల కొత్తగా చేరిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు 14 మందికి ఫోన్లు చేసి వెంటనే విధుల్లో చేరాలని భయపెట్టారని తెలిపారు. వీటికి బెదిరేది లేదని వారు స్పష్టం చేశారు. **సీతానగరం** తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన కొనసాగించారు. చెడు చూడకు, మాట్లాడకు, వినకు అంటూ కళ్లు, నోరు, చెవులు మూసుకుని నిరసన తెలిపారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ బత్తుల వెంకటలక్ష్మి, జనసేన యువనాయకుడు తోట పవన్ కుమార్, బీసీ నాయకుడు బర్ల బాబురావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ మండల సిఐటియు ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి, మండల అధ్యక్షురాలు సిహెచ్.సువర్ణ, సెక్టార్ లీడర్లు సుభాషిణి, ఉమాదేవి, ప్రశాంతి, వెంకట్ లక్ష్మి వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న రాంబాబు


నల్లజర్లలో పొర్లు దండాలతో అంగన్‌వాడీల నిరసన


సీతానగరంలో...


చాగల్లులో...


రైల్వేస్టేషన్ ఎదుట రిలే దీక్షల్లో కూర్చొన్న రైల్వే ఉద్యోగులు

రైల్వే ఉద్యోగుల రిలేదీక్షలు

ప్రజాశక్తి - నిడదవోలు

ఒపిఎస్‌ను అమలు చేయాలంటూ రైల్వే ఉద్యోగులు నిడదవోలులో మంగళవారం రిలే దీక్షలను దిగారు. ఎన్ఎఫ్ఐఆర్, ఎస్‌సిఆర్ఇఎస్ ఆధ్వర్యంలో నాయకులు డాక్టర్ మర్రి రాఘవయ్య ఎన్ఎఫ్ఐఆర్ అండ్ ఎస్‌సిఆర్ఇఎస్ పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగమ్ తాడేపల్లిగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈ దీక్షలను చేపట్టారు. ఎంపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని నినదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్‌డి.అబ్దుల్ రజాక్, వి.సోమేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసిపి గెలుపు కోసం తోట పూజలు

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి గెలుపు కోసం దేవీచౌక్ సెంటర్‌లో కనకదుర్గమ్మకు వైసిపి జగ్గంపేట నియోజకవర్గర ఇన్‌ఛార్జి తోట నరసింహం పూజలు నిర్వహించారు. మంగళవారం ఆయన గోకవరం వచ్చారు. పూజలు అనంతరం విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా గోకవరం వచ్చానన్నారు. గోకవరంలోని వ్యాపారవేత్త అక్షింతల రాజా ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో వైసిపికి మద్దతుగా ప్రచారం సాగించాలని కోరారు. అలాగే జడ్‌పిటిసి దాసరి శ్రీరంగరమేష్ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని గూర్చి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వర్షాల ప్రసాద్‌ను పరామర్శించారు. ఆయన కుమారుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అలాగే వైసిపి నాయకులు నండూరి గంగాధర్‌ను కలిశారు. ఆయన వెంట తోట రాంజీ, ఎంపిపి సుంకర శ్రీవల్లి, సుంకర వీరబాబు, నాయకులు గుల్ల ఏడుకొండలు, వి.ప్రసాద్, పాటి రాంబాబు, ఎన్.నరసయ్య, టి.రాంప్రసాద్ తదితరులున్నారు.

బిల్లులు అందించాలని వినతి

ప్రజాశక్తి- కడియం

సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.సుజాతకుమారిని ఆమె కార్యాలయంలో కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. నర్సరీలకు గతంలో సబ్సిడీలో ఆర్‌కెవివై స్కీమ్‌లో 2021-2022లో మంజూరైన పోలీ హౌస్ పెండింగ్ బిల్లులను రైతులకు అందించాలని కోరారు. ఈ ఏడాది నర్సరీ రైతులకు రాయితీపై ఉపకారణాలు అందించాలని కోరారు.

విద్యుత్ శాఖ డిఇకి వినతి

నర్సరీలకు ఇచ్చే అగ్రికల్చర్ 3 ఫేస్ విద్యుత్ కనెక్షన్లకు ఇటీవల మీటర్లు బిగిస్తున్నారని, వీటిని వెంటనే నిలుపుదల చేయాలని విద్యుత్ శాఖ డిఇ దాట్ల శ్రీధర్ వర్మను నర్సరీ అసోసియేషన్ తరపున కోరారు. మీటర్లు బిగింపుతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మీటర్లు బిగింపును నిలుపదల చేసి, యధావిధిగా ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, సెక్రటరీ గాధ నాగేశ్వరావు, డైరెక్టర్లు జంగా సుబ్బారావు, గాజుల రత్తయ్య, తాడాల నాగేశ్వరావు పి ఆర్ ఓ గరగ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కార్టూ'నిజం'



ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పెరవలి, తాళ్లపూడి, గోపాలపురం

మండలం పెరవలి గ్రామంలో ఉన్న వశిష్ట పబ్లిక్ స్కూల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు సెక్రెటరీ కరస్పాండెంట్ ఓలేటి నారాయణకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రాంగణంలో భోగి మంటలు, గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల విన్యాసాలు, చిన్నారుల విచిత్ర వేషదారణలు, నృత్య ప్రదర్శనలు చూపర్లను ఆకట్టు కున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తాళ్లపూడి మండలం కరిబండి విద్యాసంస్థల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసే విధంగా విద్యాసంస్థల ప్రాంగణంలో ముగ్గులు వేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్ కె త్రినాధ స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. **గోపాలపురం** బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించామని కరస్పాండెంట్ గూడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు.


తాళ్లపూడి కరిబండి విద్యాసంస్థల్లో పాల్గొన్న విద్యార్థులు


గోపాలపురంలో...

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో ఉంటూ బిహెచ్ఎస్ఆర్ కాలేజీలో బిఎస్‌సి చదువుతున్న సాయి లలితకు సైకిల్‌ను కేశిరాజు సీతారామయ్య బహూకరించారు. లలిత ప్రతిరోజూ 5 కిలోమీటర్లు నడిచి కళాశాలకు వెళ్తోంది. విషయం తెలుసుకున్న సంస్థ ఆమెకు సైకిల్‌ను అందించారు. అనంతరం దేవరపల్లిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 29లోగా విశ్రాంత ఉద్యోగులందరూ యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్స్‌ను నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కేసిరాజు సీతారామయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇ.నాగేశ్వరరావు, ఎ.సుభాష్‌చంద్రబోస్, కె.రాజకుమార్, పి.వెంకటరామారావు, గద్దె కృష్ణారావు, వై.సత్యనారాయణ, దేవి, వీరవల్లిశేషుమణి, సుగుణలత తదితరులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో బంధపురం గ్రామానికి చెందిన బల్ల రామకృష్ణ (45) పోలవరం కుడికాలువలో పడి మతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అదేవిధంగా యర్నగూడెం నుండి త్యాజంపూడి కొబ్బరి ఆకుల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌పై నుండి కలవలపల్లి గ్రామానికి చెందిన కోడి సందీప్ (19) ట్రాక్టర్‌పై నుండి కిందపడటంతో మతి చెందాడు. ట్రైనీ డిఎస్‌పి, దేవరపల్లి ఇన్‌ఛార్జి ఎస్‌హెచ్‌ఒ భానోదయ కేసు నమోదు చేశారు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా కేసులో మహిళ అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో 20 లీటర్ల నాటు సారా కలిగి ఉన్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఇబి సిఐ డి.సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో కందిబోయిన ధనలక్ష్మి 20 లీటర్ల నాటు సారాతో అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వెదుళ్లకుంటలో సారా బట్టీలపై దాడులు నిర్వహించామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఉండ్రాజవరపు చిన్న లక్ష్మయ్య వద్ద 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. 30 లీటర్ల సారాను సీజ్ చేశానని తెలిపారు. అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండు విధించారన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి

ప్రజాశక్తి -మామిడికుదురు

విద్యుత్ షాక్‌తో ప్రయివేటు లైన్‌మన్ మంగళవారం మృతిచెందాడు. వివరాలు ఇవి..పాశర్లపూడి బాడవ లో 216జాతీయ రహదారి ఆధునికీకరణలో భాగంగా మంగళవారం అదే గ్రామానికి చెందిన ప్రయివేటు లైన్‌మన్ వేగి వెంకటేశ్వరరావు వైర్లు మరమ్మతులు చేసున్నాడు. అయితే చెంతనే ఉన్న హైటెన్షన్ వైర్ల తగిలి షాక్‌కు గురై కింద పడి మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఈ సంఘ టన చోటు చేసుకుందని స్థానికులు వాపోతున్నారు. నగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

హత్యాయత్నం కేసులో రిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

విధి నిర్వహణలో బందోబస్తు వెళ్లిన పోలీసు సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులకు కొత్తపేట జెఎఫ్‌సిఎం కోర్టు రిమాండ్ విధించింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లొల్ల గ్రామం పంచాయతీ చెందిన వెంకయ్యమ్మ పేటలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మించేందుకు పనులు చేస్తున్న విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సాయిరాం రెడ్డి పనులు నిలుపుదల చేయాలని సంబంధిత వ్యక్తులకు నోటీసు ఇచ్చారు.కానీ అవేమీ పట్టించుకోకుండా యథావిధిగా పనులు చేయడంతో పంచాయితీ కార్యదర్శి మరియు సిబ్బంది, పోలీసు సిబ్బందితో వెళ్లారు. పంచాయతీ కార్యదర్శి సాయిరాం రెడ్డి షెడ్డు తొలగిస్తామని చెప్పగా కల్లూరి మణికంఠ బావమరిది పెన్నింటి సాయి కష్ణ అధికారులపై దాడి చేసి పోలీస్ సిబ్బందిపై హత్యా ప్రయత్నానికి పాల్పడ్డారు. దీనిపై కానిస్టేబుల్ కెవివి.సత్యనారాయణ ఫిర్యాదు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి నిందితులను కొత్తపేట జెఎఫ్‌సిఎం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఎం.భాస్కరరావు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ బివై. కిరణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని కొత్తూరు-వెదురుమూడు రోడ్లో స్కూటీని, లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం రావులపాలెం మండలం ఉబలంకకు చెందిన ఈతకోట శ్రీనివాసరావు(45) తన యొక్క ఎలక్ట్రికల్ స్కూటీ పై వెదురుమూడు నుంచి కొత్తూరు సెంటర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో పెదపల్ల గ్రామపరిదిలోని కోళ్ళ ఫారం దాటుసరికి వెనుక నుంచి లారీ అతి వేగంగా వచ్చి ముందు వెళ్ళుచున్న శ్రీనివాసరావు మోటార్ సైకిల్ ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మతి చెందారు. దీనిపై ఆలమూరు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు గ్రామంలో జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోల్ పోలీస్ సతీష్ సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను జగ్గంపేట ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఉప్పలపాడుకు చెందిన నూకతట్టు బుల్లయ్య, ఎనకోటి నాగలక్ష్మి, నూకలపాటి దుర్గ మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటే సమయంలో, రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు గాయాలపాలయ్యారు. ప్రమాదానికి కారణమైన కారులోనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే వివిధ సారా కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న 4గురు ముద్దాయిలను అరెస్టు చేసి పెద్దాపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబి వలలో రావులపాలెం ఎస్ఐ, రైటర్

ప్రజాశక్తి-రావులపాలెం

ఎసిబి వలలో రావులపాలెం ఎస్ఐ, రైటర్ చిక్కుకునారు. లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రావులపాలెం పోలీస్‌స్టేషన్‌పై రాజమహేంద్రవరం రేంజ్ ఎసిబి అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా ఎస్ఐ వెంకటరమణ, రైటర్ సత్యప్రసాదులను పట్టుకున్నారు. డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎసిబి 14400 కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దాడులు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన సత్తి విజయరామకృష్ణారెడ్డి జియో ఫైబర్ డిస్ట్రిబ్యూటర్‌కు చెందిన ఫైబర్ నెట్ కేబుల్ వల్ల బ్యాంక్ ఉద్యోగి చనిపోయాడు. దీంతో ఎఫ్ఐఆర్‌లో తక్కువ శిక్షలు పడే సెక్షన్ 304-ఎ వేసి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకుగాను రూ.1 లక్ష లంచంగా డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారు.దీనిపై



ఎసిబి చిక్కిన ఎస్ఐ , రైటర్

కేసు నమోదు చేసుకున్న ఎసిబి అధికారులు దాడులు చేశారు. రావులపాలెం ఎస్ఐ ఆదేశాల మేరకు రైటర్ సత్య ప్రసాద్ రూ.25వేలు బాధితుని వద్ద నుంచి లంచంగా తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

టిడిపి,జనసేనదే విజయం

ప్రజాశక్తి - సీతానగరం

రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేనదే విజయమని టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. ఈ నెల 7న బూరుగుపూడి గేటు వద్ద సామాజిక సాధికార యాత్ర సభలో కనిపించిన ఖాళీ కుర్చేలే రానున్న ఎన్నికల్లో వైసిపి పరిస్థితిని తేటతెల్లం చేస్తున్నాయన్నారు. సాధికార బస్సుయాత్ర తుస్సుమందన్నారు. ముఖ్యమంత్రి జగన్ దళిత ద్రోహి అన్నారు. చంద్రబాబు దళిత విద్యార్థులు విదేశీ చదువుల కోసం అమలు చేసిన పథకాన్ని జగన్ రద్దు చేయడం దళిత యువతకు ద్రోహం చేయడమేనన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యలో అంబేద్కర్ పేరు తీసేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. దళితుడిని హత్యచేసిన ఎంఎల్‌సిపై చర్యలు తీసుకోకుండా వెంటబెట్టుకుని తిరగడం జగన్‌కే చెల్లిందన్నారు. పండుగవేళ అందర్నీ పస్తులు ఉంచుతున్నాడని విమర్శించారు. రానున్న రోజుల్లో వైసిపికి ప్రజలే తప్పక బుద్ధి చెబుతారన్నారు.



మద్దతు ఇస్తున్న పలువురు నాయకులు

అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి - యానాం

యానాం సామాన్య ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 42 మంది సిబ్బందికి న్యాయం జరగాలంటే తప్పనిసరిగా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పలు రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. 44 నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ చేపట్టిన ఆందోళన మంగళవారానికి 7వ రోజుకు చేరింది. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద చేపట్టిన ఆందోళనకు తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్థాని దినేష్, మల్లాడి సత్తిబాబు, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీ బాయ్, గోపి సురేష్, డిఎంకె నాయకులు పోశియ్య, అనితా వెంకటేశ్వరమ్మ, లంకే జాన్, తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని చేయించుకున్న ప్రభుత్వ అధికారులు సిబ్బందికి వేతనాలు అందించాలనే జ్ఞానం లేకపోవడం విచారకరమని అన్నారు. 44 నెలలుగా జీతాలు లేకపోవడంతో ఆయా కుటుంబాలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారుల వైఖరి వల్ల ఆయా కుటుంబాలు నేడు రోడ్డున పడ్డాయని, అందుకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే అఖిలపక్షం నిర్వహించి రాజకీయాలకు అతీతంగా బాధితులకు అండగా నిలవాలని కోరారు.

బత్తిన, జక్కంపూడి అడుగుజాడల్లో నడుస్తా : మంత్రి వేణు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

మాజీ మంత్రులు, నాటి కడియం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన బత్తిన సుబ్బారావు, జక్కంపూడి రామ్మోహన్రావు అడుగుజాడల్లో తాను ముందుకెళ్తానని వైసిపి రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌ఛార్జి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ధవలేశ్వరంలో 'బంధు వందనం' కార్యక్రమం పేరిట రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ దళితుల ఆత్మీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను జక్కంపూడి నాటిన విత్తనమన్నారు. వైఎస్ఆర్ హయాంలో మానుగా మారితే ముఖ్యమంత్రి జగన్ తనను ఫలసాయం ఇచ్చే చెట్టుగా మార్చారని పేర్కొన్నారు. అంతకుముందు దళిత నాయకులు స్టాలిన్ దళితుల సమస్యల గురించి సభలో ప్రస్తావించారు. దళిత నాయకులకు తగిన నామినేటెడ్ పోస్ట్ కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన గత నాయకులు ఎవరూ దళితులను పట్టించుకోలేదన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా చూడవలసిన బాధ్యత మంత్రి వేణుపై ఉందన్నారు. దీనిపై స్పందించిన మంత్రి వేణు మాట్లాడుతూ దళిత, బిసి, బహుజన, మైనార్టీ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా వైసిపి పనిచేస్తుందన్నారు. రూరల్ నియోజకవర్గంలో కష్టపడే ప్రతి దళిత నాయకునికి గుర్తింపు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన దళిత నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ప్రయాణికులతో గౌరవంగా మెలగాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆటో ప్రయాణికులతో గౌరవ, మర్యాదలతో ప్రవర్తించాలని అమ్మ ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు ఏసుబాబు కమిటీ సభ్యులకు సూచించారు. మండలంలోని చివటంలో 42 మంది సభ్యులతో అమ్మ ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కమిటీకి నూతన అధ్యక్షులుగా వీరమల్లు అంజి, ఉపాధ్యక్షులుగా గోపిశెట్టి త్రిమూర్తులు, కోశాధికారిగా ఉండ్రాజవరపు అప్పారావు, కార్యదర్శిగా గంధం సత్యనారాయణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది. నూతన అధ్యక్షుడు అంజి మాట్లాడుతూ సభ్యులంతా ఐక్యంగా ఉండాలన్నారు.

'బత్తుల' ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మూడు రోజులుగా అన్నదానం నిర్వహిస్తున్నారు. మంగళవారం సీతానగరం బస్టాండ్ వద్ద నాలుగో రాజు డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని జనసేన పార్టీ యువజన నాయకులు తోట పవన్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పవన్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయాలకు, కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా జరుగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం ప్రతిరోజు మధ్యాహ్నం రాజానగరం, సీతానగరం, కోరుకొండ బస్టాండ్‌ల వద్ద ప్రారంభించామన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం నిర్వీర్యం : గోరంట్ల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జగన్ పాలనలో రాష్ట్రం అంతా నిర్వీర్యంగా మారిందని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. ఆయన నివాశంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని విధాల జగన్మోహన్ రెడ్డి నాశనం చేశారన్నారు. పచ్చని పంటలకు నిలయమైన రాష్ట్రంలో రైతన్నలు పంటలు పండించలేక పండించిన పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌలు రైతులు శిస్తు కూడా కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో రోజుకి ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని జగన్ పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వేరే రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారన్నారు. జగన్ అధికారం చేపట్టాక ఎన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చారని? ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకుంటున్నారన్నారు. ఇసుక, మట్టి, మైనింగ్ మాఫియా ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే జరుగుతుందన్నారు. ఎంఎల్ఎల పనితీరు బాలేదని దానివల్ల మార్పులు చేస్తున్నామని జగన్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిని మార్చాలని అనుకుంటున్న విషయాన్ని జగన్ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ప్రత్తిపాటి రామారావుచౌదరి, జిల్లా కార్యదర్శి పిన్నింటి ఏక బాబు, తలారి మూర్తి, పిన్నింటి రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల

దేవరపల్లి సిఐగా రామకృష్ణ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి సిఐగా కె.రామకృష్ణ నియమితులయ్యారు. మంగళవారం దేవరపల్లి సిఐ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. గతంలో ఆయన రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సిఐగా పని చేశారు. గతంలో సిఐడిలో పని చేశారు. దేవరపల్లి, పాలకొల్లు, కొవ్వూరు, కొవ్వూరు రూరల్, పోడూరు, చింతలపూడిలో ఎస్ఐగా విధులు నిర్వహించారు ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు

చురుగ్గా రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని ఆర్ అండ్ బి రోడ్లు మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మార్టేరు-ప్రక్కిలంక ఆర్ అండ్ బి రహదారిలో గల తాళ్లపూడి మండలం మలకపల్లి నుంచి ఈ మరమ్మతు పనులు చేపట్టారు. నాలుగున్నరేళ్లుగా ఈ రోడ్డు గుంతలతో ప్రయాణాలకు అనుకూలంగా ఉండేవి. ప్రజలునానా ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు మరమ్మతు పనులు చేపట్టారు.

వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

ప్రజారోగ్య వ్యవస్థ పనితీరును నేరుగా పరిశీలించేందుకు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రత్యేక బృందం మంగళవారం ఇందిరమ్మ కాలనీలో తనిఖీలు నిర్వహించింది. డిపిఎంఒ డాక్టర్ అభిషేక్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా గణాంక అధికారి జె.కుమారస్వామి, డిపిహెచ్ఎన్ఒ వసంతలక్ష్మి, డిపిఒ సంధ్యారెడ్డి, డేటా మేనేజర్ ఎస్.రామకృష్ణ ఈ బృందంలో ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గర్భిణులకు, ప్రజలకు, వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.మనోజ్, పిహెచ్ ఎన్.షేక్‌జమీల, హెల్త్ సూపర్‌వైజర్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరం సందర్శన

ప్రజాశక్తి- కడియం

జగనన్న ఆరోగ్య సురక్ష 2వ దశ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాధవరాయుడుపాలెం సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన శిబిరాన్ని డిఎంహెచ్ఒ కె.వెంకటేశ్వరరావు సందర్శించారు ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొత్తం 409 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారని మెడికల్ ఆఫీసర్ నాగసాయిమౌర్య తెలిపారు. అలాగే 4 కేసులను ఆరోగ్యశ్రీకి రిఫరల్ చేశామన్నారు. ఈ క్యాంపులో వైద్యులు మణి జ్యోత్స్న, కె.రామమోహన్, జికెఎల్.పూర్ణిమ వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి వశిష్ఠ పబ్లిక్ స్కూల్లో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం, ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలపై డివిజన్ స్థాయి చర్చ, శిక్షణను నిర్వహించారు. రైతులు, ఎపి సిఎన్ఎఫ్ సిబ్బంది, ఎస్ఇఆర్ఎఫ్ సిబ్బందికి జిల్లా ఎన్ఎఫ్ఎ(టిఅండ్‌సి) జె.సతీష్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 2023 వరకూ రైతులు సాధించిన ప్రగతి పురోగతి, రానున్న కాలంలో చేపట్టాల్సిన విధానలపై చర్చించారు. రాబోయే కాలంలో గ్రామస్థాయిలో రైతులు అనుకూలంగా ఇన్‌పుట్ డెమోస్‌పై విక్షణ ఇస్తామన్నారు. కిచెన్ గార్డెన్స్‌పై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వెంకటపతికి కేకును తినిపిస్తున్న జ్యోతుల నెహ్రూ

ఘనంగా వెంకటపతి పుట్టిన రోజు

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని తంటికొండకు చెందిన టిడిపి యువ నేత నాగం వెంకటపతి పుట్టిన రోజు దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర ఆధ్వర్యంలో మంగళవానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కేక్ కట్ చేయించారు. వెంకటపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటపతి మాట్లాడుతూ తనగురువైన జ్యోతుల నెహ్రూ దంపతులు చేతులు మీదుగా పుట్టినరోజును నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొత్త కొండబాబు, మలిరెడ్డి వెంకట శ్రీధర్, మండపాక అప్పన్న దొర, బసవ చిన్నబాబు, అడబాల సత్తిబాబు, బదిరెడ్డి రవి, గడ్డం బాబు, అడబాల సింగారయ్య, కేజీరెడ్డి శ్రీను, సైనం శ్రీను, మాదేపల్లి వంశీ, కోమటి పవన్, అమర వెంకటేష్ పాల్గొన్నారు.

పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు డిఎ, పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు ఐవి.సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 12వ పిఆర్‌సి కమిటీ నివేదిక అందేలోపు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వనమట్ల వెంకటేశ్వరరావు, సహాధ్యక్షులు షేక్ ఆలీసాహెబ్, ప్రసాద్, కోశాధికారి, ప్రభుదాస్, ఐడివి.అప్పారావు, కాలి సుబ్బారావు, యేసు రత్నం, నెక్కలపూడి ప్రతాప్, రాజేంద్రప్రసాద్, సుంకర దత్తు, బాలయ్య. తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

విజ్జేశ్వరంలో బ్యారేజీ రోడ్డు మరమ్మతులు, అభివృద్ధి పనులకు హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత మంగళవారం శంకుస్థాపన చేశారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. విజ్జేశ్వరం బ్యారేజీ లాకు నుంచి నుండి ధవళేశ్వరం సర్ అర్థర్ కాటన్ బ్యారేజీ వరకు రూ.1.76 కోట్లతో ఈ పనులను చేపట్టనున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంప్ విజయవంతం

ప్రజాశక్తి - రాజానగరం

మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజపేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ సెంటర్ పోంగ్ డ్యామ్ సమీపంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ అడ్వెంచర్ క్యాంప్‌ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేశారని విసి కె.పద్మరాజు తెలిపారు. విద్యార్థులను అభినందించారు. పది మంది విద్యార్థులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఈ క్యాంపులో పాల్గొన్నారన్నారు. గతేడాది డిసెంబర్ 19 నుంచి 28 వరకు ఈ క్యాంప్ జరిగిందన్నారు. స్విమ్మింగ్, క్యాకింగ్, సర్ఫింగ్, బోటింగ్, ట్రక్కింగ్‌లలో ప్రతిభను కనబర్చారన్నారు. ఈ సాహసయాత్రలో డాక్టర్ ఎన్.రాజశేఖర్, ఐ.ఆనందబాబు, ఎస్.సందీప్, ఎస్.జానకిరామ్, జి.ఆది, పి.దుర్గాగణేష్, సిహెచ్.శరిష్మ, పి.సాయిరత్నం, ఆర్.ఉష, కె.హర్షిణి, ఎస్.లక్ష్మీదేవి, పాల్గొన్నారని తెలిపారు. మైనస్ రెండు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో సైతం వారు సాహస యాత్రను సాగించారని తెలిపారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విసి పద్మరాజ